సాక్షి
వికారాబాద్
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



భావిగి దేవా.. భక్తుల బ్రోవ

తాండూరు పట్టణ పరిధిలోని శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. 8లో▸



వెలవెలబోతున్న ..

గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు సరైన పరికరాలు లేక వెలవెలబోతున్నాయి. 8లో▸



సర్వర్ బిజీ బిజీ!

రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రికి సీసీఐ చేయూత

తాండూరు రూరల్: పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి శనివారం సీసీఐ ఫ్యాక్టరీ తరఫున రూ.5 లక్షల విలువ చేసే సాంకేతిక పరికరాలను సీఎండీ సంజయ్‌బంగా అందజేశారు. అంతకుముందు మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులో ఉన్న ఆయన సందర్శించారు. ఫ్యాక్టరీలోని వివిధ విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన సిమెంట్‌కు సీసీఐ పేరని అన్నారు. అనంతరం కరన్‌కోట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలసి సీఎండీని కలిశారు. కంపెనీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణుబసప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, నాయకులు భరత్ కిషోర్, సుధాకర్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఏఎంసీ డైరెక్టర్



యాలాల: సీఎం రేవంత్‌రెడ్డిని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ ఈడ్గి నర్సింహులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పగిడియాల గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ధారూరు మార్కెట్‌కు 279 బస్తాల కందుల రాక

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 279 బస్తాల కందులు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.7,100 నుంచి రూ. రూ.7,330 వరకు ధర పలికిందని వివరించారు. మొక్కజొన్న 77 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,200 నుంచి రూ.2,280 వరకు, వేరుశెగన 30 బస్తాలు వచ్చాయని క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ.5,400 వరకు ధర పలికిందని ఆమె తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం: స్పీకర్

కుల్కచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు భరత్‌కుమార్, సీటీఓ రాంచందర్ నాయక్, విగ్రహ దాత రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: హనుమాన్ శోభాయాత్రలో భక్తుల కోలాహలం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. మహా నైవేద్యం సమర్పించారు. హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, శోభాయాత్ర నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

– వికారాబాద్



అనంతగిరి: పూజలందుకున్న ఆంజనేయస్వామి

పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో హోమం

దుద్యాల్: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో శనివారం హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక హోమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమికి హోమం నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న భక్తులు ఒక్కరోజు ముందుగా తమను సంప్రదిస్తే హోమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



యాలాల: పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

నకిలీ.. మకిలీ

మార్కెట్‌లోకి నాసిరకం పత్తి విత్తనాలు

- ఏజెంట్ల ద్వారా విక్రయాలు
- వానాకాలం సీజన్‌కు ముందే దందా షురూ..
- బ్రాండెడ్ కంపెనీల పేరుతో మోసం
- నష్టపోతున్న అన్నదాతలు

కొడంగల్: నియోజకవర్గంలో నాసిరకం పత్తి విత్తనాల దందాకు తెరలేసింది. వానాకాలం సీజన్‌కు ముందే పలు గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకొని వారి ద్వారా విక్రయాలు చేపట్టారు. నిరుద్యోగ యువకులకు డబ్బులు ఆశ చూపి నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. బ్రాండెడ్ కంపెనీల కవర్లలో నాసిరకం విత్తనాలు నింపి విక్రయిస్తున్నారు. అభం శుభం తెలియని రైతులు వాటిని కొనుగోలు చేసి పంట దిగుబడి రాక నష్టపోతున్నారు.

కర్ణాటక నుంచి సరఫరా..

రాష్ట్ర సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతోంది. హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై కొడంగల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో కర్ణాటకకు చెందిన గుర్మిట్కల్ పట్టణం ఉంది. అక్కడి ఎరువుల వ్యాపారి నకిలీ విత్తనాల దందా చేస్తున్నట్లు తెలిసింది. అతను కర్ణాటకలోని కుష్టిగిరి జిల్లాలో ఉన్న జిన్నింగ్ మిల్లు నుంచి తక్కువ ధరకు నాసిరకం పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తాడు. వాటిని బ్రాండెడ్ కంపెనీల కవర్లలో ప్యాకింగ్ చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు గతంలో అతనిపై కేసులు నమోదయ్యాయి. అతను హైదరాబాద్‌లోని ఒక ప్యాకింగ్ కంపెనీలో బ్రాండెడ్ కంపెనీల కవర్లను కొనుగోలు చేసి నాసిరకం విత్తనాలు పోసి ఏజెంట్ల ద్వారా విక్రయిస్తున్నాడు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో ఆయనకు ఏజెంట్లు ఉన్నట్లు సమాచారం. వారి ద్వారానే నకిలీ దందా జోరుగా సాగుతున్నట్లు తెలిసింది.

జైలుకు వెళ్లినా మారని బుద్ధి

గతంలో కొడంగల్ మండలం అన్నారం గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో నకిలీ విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ దొరికిన సామగ్రిని చూసి అధికారులు నివ్వెర పోయారు. 320 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, బ్రాండెడ్ కంపెనీల పేరుతో ఉన్న 60 ప్యాకెట్లు, వివిధ కంపెనీల పేరుతో తయారు చేయించిన 290 పోర్జరీ కవర్లు, విత్తనాలు కొలిచే డబ్బా దొరికింది. అదే రోజు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుల సమాచారంతో పోలీసులు తీగలాగితే డొంక కదిలింది. పోలీసులు నిఘా పెంచడంతో సూత్రధారులు, పాత్రధారులు పట్టుబడ్డారు. కొంత కాలానికి వారు రిమాండ్‌పై వచ్చి తిరిగి దందా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. మరో రెండు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడిలో..

రెండేళ్ల క్రితం కొడంగల్ మండలం నందిగామ గ్రామ శివారులో ఓ రైతు పొలం వద్ద 25 కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. సదరు రైతును విచారించగా దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పాడు. పోలీసులు, వ్యవసాయాధికారులు గోకఫస్లాబాద్‌లో సోదాలు నిర్వహించగా 14క్వింటాళ్ల నాసిరకం పత్తి విత్తనాలు దొరికాయి. విచారించగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలోని ఒక ప్రాసెసింగ్ యూనిట్ దగ్గర కొన్నట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. ఇలాంటి సంఘటనలు నియోజకవర్గంలో మళ్లీ పునరావతం అవుతున్నాయి. ప్రతి ఏడాది అధికారులు దాడులు చేసినా నకిలీ మకిలీని అరికట్ట లేకపోతున్నారు. వ్యవసాయాధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకొని నకిలీ విత్తనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- అప్రమత్తంగా ఉండాలని రైతులకు ఎస్పీ నారాయణరెడ్డి సూచన

యాలాల: మండలంలోని బాగాయిపల్లి చౌరస్తాలో 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్, యాలాల పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. ఉదయం 6గంటల ప్రాంతంలో బాగాయిపల్లి చౌరస్తాలో ముగ్గురు వ్యక్తులు ప్లాస్టిక్ సంచులతో ఉన్నారు. తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. ముగ్గురిలో ఇద్దరిని పట్టుకోగా ఒక వ్యక్తి పారిపోయాడు. ప్లాస్టిక్ సంచులను పరిశీలించగా రూ.44 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కురుబల కోట మండలం అంగళ్ల గ్రామానికి చెందిన నన్నపనేని శివనాగేశ్వరరావు, గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన దాసరి శ్రీనివాస్‌రావు, కొత్తకోటకు చెందిన నారాయణరెడ్డి నకిలీ పత్తి విత్తనాలను దుకాణాలు, రైతులకు విక్రయించడానికి వచ్చినట్లు పోలీసులు విచారణలో తేలింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పారిపోయిన వ్యక్తి నారాయణరెడ్డిగా గుర్తించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమతి లేని డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. ఆధీకృత డీలర్ వద్దే కొనుగోలు చేసి రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా, యాలా ల ఎస్ఐ గిరి, ఏఓ శ్వేతరాణి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద హకీంపేట్ రైతులు

పట్టా భూములపై పట్టు

- హకీంపేట్ భూ బాధితులతో సబ్ కలెక్టర్ సమావేశం
- పరిహారం పెంచాలని రైతుల అభ్యర్థన
- ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్
- లేదంటే భూములిచ్చేది లేదని స్పష్టీకరణ

దుద్యాల్: తమ పట్టా భూముల జోలికి రావొద్దని మండల పరిధిలోని హకీంపేట్‌కు చెందిన రైతులు తేల్చిచెబుతున్నారు. పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో పట్టా, అసైన్డ్ భూములు కలిగి ఉన్న కొంత మంది రైతులు ఇప్పటికే స్థలం అప్పగించి పరిహారం పొందారు. హకీంపేట్ గ్రామానికి చెందిన సుమారు 36 మంది రైతులు తమకు సంబంధించిన 50 ఎకరాల పట్టా భూమిని ఇచ్చేది లేదని గతంలోనే పలుమార్లు అధికారులకు తెలియజేశారు. దీంతో సదరు రైతులకు వారం రోజుల క్రితం అధికారులు నోటీసులు జారీ చేశారు. పట్టా భూములు ఇవ్వాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో గత శుక్రవారం హకీంపేట్‌కు చెందిన 17 మందిని తాండూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి రప్పించారు. వీరితో సమావేశమైన తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్‌తో వ్యక్తిగతంగా ఒక్కొక్కరి అభిప్రాయం తెలుసుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న తమ భూములకు ఎకరాకు రూ.2 కోట్లు చెల్లిస్తేనే ఇస్తామని కొంతమంది రైతులు తెలిపారు. మిగిలిన వారిలో కొందరు రైతులు ప్రభుత్వం నిర్ణయించిన (ఎకరాకు రూ.20 లక్షల చొప్పున) పరిహారం తీసుకుని, భూములు ఇచ్చేస్తున్నారు.

పరిహారం అందలేదు



పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా నాకున్న రెండున్నర ఎకరాల అసైన్డ్ భూమిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపాను. ఇప్పటి వరకూ పరిహారం అందలేదు. పట్టా భూమి కూడా ఇవ్వాల్సిందేనని నోటీసులిచ్చారు. ఇదెక్కడి న్యాయం..? వరంగల్ జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం చేపట్టిన భూములకు ఎకరాకు రూ.2 కోట్లు ఇస్తున్నారు. మాకు అలాగే ఇవ్వాలి.

– రాకం యాదయ్య, రైతు, హకీంపేట్

ఎక్కువ ఇవ్వడం సాధ్యం కాదు



హకీంపేట్ రైతులతో ఈ నెల 11న సమావేశం నిర్వహించా. పట్టా భూములు కలిగిన 17మంది హాజరయ్యారు. తమ భూములు రోడ్డు పక్కన ఉన్నందున ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం అందరికీ ఒకే రకమైన న్యాయం వర్తిస్తుందని చెప్పాం. ఎక్కువ చేసి ఇవ్వడం సాధ్యం కాదు.

– ఉమాశంకరప్రసాద్, తాండూరు సబ్ కలెక్టర్

బొంరాస్‌పేట మండలంలో ఎక్సైజ్ తనిఖీలు

బొంరాస్‌పేట: కల్తీకల్లు తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని బురాన్‌పూర్, యాలాల మండలంలోని ముద్దాయిపేటలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, తాండూరు, పరిగి, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్లు, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



బురాన్‌పూర్‌లో సోదాలు చేస్తున్న అధికారులు



పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎన్నికలప్పుడే రాజకీయం

- ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి పని చేస్తా
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- తాండూరు, పెద్దేముల్ మండలాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని..అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పని చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తాండూరు, పెద్దేముల్ మండలాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని పార్టీల నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి పని చేస్తానని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.11 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్, నర్సాపూర్,గాజీపూర్,తాండూరు మండలంలోని గోనూర్,వీరెశెట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు. జూలై నుంచి అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, పార్టీ తాండూరు, పెద్దేముల్ మండలాల అధ్యక్షులు ప్రభు శంకర్, హరీశ్, నాయకులు విక్రం, రాంచెంద్రి, యాదు గౌడ్, రాంసాగర్, శ్రీకాంత్, వడ్ల రఘు, నరేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ధారూరులో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ధారూరు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. తొలి విడతలో ఇళ్లు రాని వారు ఆందోళన చెందరాదని అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ధారూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గురుదోట్ల గ్రామం నుంచి టేకులపల్లితండా వరకు రూ.3.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, రూ.2.40 కోట్లతో మైలారం నుంచి మైలారం కొత్త తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు, రూ.90 కోట్లతో నాగారం నుంచి వికారాబాద్ వయా మైలారం, తరిగోపుల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ కృష్ణయ్య, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, హన్మంత్‌రెడ్డి, రాములు, మాన్‌సింగ్, విజయభాస్కర్‌రెడ్డి, అశోక్, బుజ్జయ్యగౌడ్, ఎస్‌కే ఆశం, గఫార్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

బంట్వారం: గిరిజన తండాల్లోని అన్ని కాలనీల్లో బీటీ రోడ్లు వేస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం కోట్‌పల్లి మండలం మద్దుల్ తండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తండా వరకు రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సన్న బియ్యం పంపిణీని ప్రజలు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని సందర్శించుకున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

యాలాల: గ్రామాల అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అక్కంపల్లి, జుంటుపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని పేర్కొన్నారు. తూముకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.కార్యక్రమంలో యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, జిల్లా నాయకుడు రమేష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు రామ్య నాయక్, నారాయణరెడ్డి, రమేష్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ అభివృద్ధికి కృషి

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గంలో రూ.173 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం వికారాబాద్ నుంచి పరిగి వరకు రూ.77 కోట్లతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు మద్గుల్ చిట్టంపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం వికారాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 42మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్‌టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల మాజీ చైర్మన్ సత్యనారాయణ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, జాఫర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు మురళి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.



ధారూరులో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

పరిగి: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. 14 నెలల పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం సొంత జిల్లా కావడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను సీఎం త్వరలో ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, నాయకులు ఆనందం, గోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జోరుగా పొలం పనులు



ట్రాక్టర్‌తో పొలం చదును చేస్తున్న రైతు

కొడంగల్‌: నియోజక వర్గంలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు ఖరీఫ్‌ సీజన్‌లో విత్తనాలు వేయడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఎద్దు.. ఎవుసం కనుమరుగు కావడంతో యంత్రాలతో దుక్కులు దున్నుతున్నారు. కొడంగల్‌, దౌల్తాబాద్‌, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో అధిక మొత్తంలో నల్లరేగడి భూములు ఉన్నాయి. కొన్ని చోట్ల ఎర్ర నేలలు, చెల్కలు ఉన్నాయి. ఖరీఫ్‌లో ఎక్కువ భాగం కంది, పత్తి, జొన్న, పెసర, మినుము పంటలు వేయడానికి పొలాలను చదును చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు.

వైభవంగా మౌనేశ్వర స్వామి వార్షికోత్సవం



పూజలందుకుంటున్న మౌనేశ్వర స్వామి

దుద్యాల్‌: మండల కేంద్ర సమీపంలోని గుట్టపై వెలసిన మౌనేశ్వర స్వామి వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. రెండు రోజులు సాగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మోనయ్య పంతులు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రత్యేక హోమంతో పాటు అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభలు జయప్రదం చేయాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతగిరి: ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకుడు, కామ్రేడ్‌ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, కార్యదర్శి రాజేశ్‌ కోరారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్‌ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అమరత్వాన్ని విషాద జ్ఞాపకంగా కాకుండా మరో పోరాటానికి ఉత్తేజంగా మలుచుకోవాలన్నారు. అందుకోసమే ప్రత్యేక సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అణగారిన విద్యార్థుల పక్షాన ఉండి పోరాటం చేసిన మహాయోధుడన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌, సురేష్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

మీర్‌పేట: వుడ్‌ వర్క్స్‌ షాపులో షార్ట్‌ సర్క్యూట్‌ జరిగి విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేట వెంకటాద్రి కాలనీకి చెందిన కంచర్ల గౌరీశంకర్‌ దావుద్‌ఖాన్‌గూడలో సిసిరా వుడ్‌ వర్క్స్‌ పేరిట షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి షాపును మూసివేగా షార్ట్‌ సర్క్యూట్‌తో రూ.20 లక్షల విలువైన సామగ్రి, షెడ్డు పూర్తిగా దగ్ధమైంది.

భావిగి దేవా.. భక్తుల బ్రోవ



భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయం



స్వామివారి రథోత్సవం (ఫైల్‌) (ఇన్‌సెట్‌లో) ఆలయంలో స్వామివారు



- 15 నుంచి తాండూరు భావిగి భద్రేశ్వర బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ నిర్వాహకులు

తాండూరు టౌన్‌: జిల్లాలోనే ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నారు. అందుకు ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో ఆలయ కమిటీ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయానికి వేలాది కుటుంబాలు తమ ఇలవేల్పుగా కొలుస్తున్నాయి. 23వ తేదీ వరకు స్వామి వారి ఉత్సవాలు నిర్వహించేందు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

15వ తేదీ నుంచి ఉత్సవాలు

తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 15, 16వ తేదీల్లో రాత్రి 10 గంటలకు ఆలయం నుంచి స్వామి వారి పల్లకీ సేవ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి గాంధీచౌక్‌ మీదుగా రాచన్న దేవాలయం వద్దకు వెళ్లి తిరిగి అదే మార్గంలో ఆలయానికి చేరుకుంటుంది. 19వ తేదీ రాత్రి రథోత్సవం, 20న బసవణ్ణ కట్ట సమీపంలో రాత్రి 2గంటలకు లంకాదహనం, అదే రోజు ఉదయం సరస్వతి శిశుమందిర్‌ ప్రాథమిక పాఠశాలలో పశు ప్రదర్శన జరుగుతాయి.

ఖ్యాతిగాంచిన పశువుల సంత

భావిగి భద్రేశ్వర స్వామి ఉత్సవాల్లో పశువుల సంతకు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సంతకు జిల్లాలోని పశువులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ఎద్దులను రైతులు తీసుకువస్తారు. ఏటా జరిగే ఉత్సవాలలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పైగా జోడెడ్ల ధర పలుకుతుంది.

రథానికి ప్రత్యేక గుర్తింపు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అత్యంత ఎత్తైన రథం తాండూరు భావిగి భద్రేశ్వరస్వామికి ఉంది. ఉగాది పండగ రోజు నుంచి రథం నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. దాదాపు 25 రోజుల పాటు పనులు కొనసాగుతాయి. ఉత్సవాలకు ప్రభుత్వ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. మున్సిపల్‌, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్‌, అగ్నిమాపక, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించనున్నారు. పట్టణంలోని పురవీధులలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు.

ఆలయ నేపథ్యమిదీ..

కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌ పట్టణానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న భావిగి భద్రేశ్వరస్వామి మఠం ఉంది. 18వ శతాబ్దంలో అక్కడ జరిగే ఉత్సవాలను తిలకించేందుకు తాండూరు పట్టణానికి చెందిన పటేల్‌ బసణ్ణ ఎడ్ల బండి కట్టుకొని వెళ్లారు. దర్శనం చేసుకొని వెనుదిరుగుతుండగా స్వామి వారు వచ్చి ప్రసాదం తీసుకోమని చెప్పారని గాథలున్నాయి. అనంతరం బసణ్ణ తాండూరుకు వస్తుండగా ఎద్దుల బండి వెంటే స్వామి వారు వస్తున్నారు. ఆయన బండి ఎక్కమని కోరినా నడుచుకుంటునే తాండూరు వరకు వచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆలయం వద్దనే స్వామి వారు అదృశ్యమయ్యారు. ఎంత వెతికినా జాడ కనిపించలేదు. దీంతో అక్కడే బసణ్ణ ఆలయ నిర్మాణం చేపట్టి గర్భగుడిని నిర్మించారు. ఇప్పటికీ అదే ఉంది. అప్పటి నుంచి ఏటా చైత్ర మాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.

వైభవంగా నిర్వహిస్తాం



భావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈ నెల 14వ తేదీ నుంచి నిత్యాన్నదానం కోసం భవనం సిద్ధం చేశాం.

– పటేల్‌ కిరణ్‌కుమార్‌, ఆలయ కమిటీ చైర్మన్‌

పూజల పేరిట మోసాలు

నకిలీ బాబా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్‌ డీసీపీ డాక్టర్‌ బాలస్వామి

కాచిగూడ: 'మీ జాతకం బాగాలేదు..శాంతి పూజలు చేయాలి' అంటూ ఓ మహిళకు మాయమాటలు చెప్పి అందిన కాడికి బంగారం, నగదుతో ఉడాయించిన బురిడీ బాబాను కాచిగూడ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఈస్ట్‌జోన్‌ అడిషనల్‌ డీసీపీ జె.నర్సయ్యతో కలిసి డీసీపీ డాక్టర్‌ బాలస్వామి వివరాలు వెల్లడించారు. ఎల్‌బీ నగర్‌లోని రాక్‌ టౌన్‌ కాలనీకి చెందిన అంజనేయులు కుమారుడు అరిగెల సాంబశివుడు (45) అలియాస్‌ గురూజీ శివస్వామి వృత్తిరీత్యా ప్రైవేట్‌ ల్యాండ్‌ సర్వేయర్‌. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ప్లాన్‌తో దొంగబాబా అవతారం ఎత్తాడు. తిలక్‌నగర్‌ ప్రాంతానికి చెందిన గీతా వైద్య దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజీలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. సంవత్సరం క్రితం ఆమె భర్త చనిపోయాడు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ సౌమ్య ద్వారా గీతకు సాంబశివుడు పరిచయమయ్యాడు. మీ ఇంటికి దోషం ఉందని, మీ పేరు మీద బాగాలేదని ముందు ముందు చాలా ఇబ్బందులు పడతారని, మీ భర్త చనిపోయినట్లే మీ కుటుంబం అంతా చనిపోతారని భయపెట్టాడు. దోషం పోవాలంటే పూజలు చేయించాలని, ఇందుకు రూ.1.70 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి ఆమె దగ్గర డబ్బులు తీసుకున్నాడు. అనంతరం కొద్దిరోజులకు మళ్లీ మీ కూతురికి పెళ్లయితే విడాకులు అవుతాయని, అందుకు దోష నివారణకు పూజలు చేయాలని, దానికి లక్షలు ఖర్చు అవుతుందని మాయమాటలు చెప్పాడు. దీంతో భయపడిన గీత తన దగ్గర ఉన్న 26 తులాల బంగారు నగలు ఇచ్చింది. అదే కాకుండా ఆమె ఇంటి పత్రాలను కూడా ఇచ్చింది. ఈ దశలో అనుమానం వచ్చిన గీతా వైద్య కూతురు ప్రతిఘటించి దొంగ బాబా దగ్గర ఇంటి పత్రాలను తిరిగి తీసుకున్నారు. అనంతరం కాచిగూడ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కాచిగూడ పోలీసులు సాంబశివుడిని అదుపులోకి తీసుకొని అతనివద్ద నుంచి 20 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇలాంటి బురిడీ బాబాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు.

క్యాబ్‌ డ్రైవర్‌ నిజాయితీ

అత్తాపూర్‌: క్యాబ్‌లో మరిచిపోయిన బంగారు గొలుసును ప్రయాణికురాలికి తిరిగి అప్పగించామని అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగేశ్వరరావు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్‌ జలాల్‌బాబానగర్‌కు చెందిన షమీనాబేగం(27) బాలానగర్‌ నుంచి ఊబెర్‌ క్యాబ్‌లో శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి జలాల్‌బాబానగర్‌కు చేరుకుంది. నాలుగున్నర తులాల బంగారు నెక్లెస్‌ ఉన్న హ్యాండ్‌ బ్యాగ్‌ను క్యాబ్‌లో మరచిపోయారు. వాహనదారుడు మైపాల్‌ ఊబెర్‌ క్యాబ్‌ డ్రైవర్‌గా గుర్తించారు. అత్తాపూర్‌ పోలీసులు క్యాబ్‌ డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించగా తన క్యాబ్‌లోనే ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను పోలీసుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా క్యాబ్‌ డ్రైవర్‌ మహిపాల్‌ను ఇన్‌స్పెక్టర్‌ నాగేశ్వర్‌రావు అభినందించారు.

శ్మశానవాటికకు దారి లేదని శవయాత్ర అడ్డగింత

పూడూరు: శ్మశానవాటికకు దారిలేదని, శవాన్ని వెళ్లనిచ్చేది లేదని అడ్డుకున్న సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌ గ్రామానికి చెందిన నస్కంటి బుగ్గయ్య మృతి చెందడంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు వెళ్తున్నారు. అదే ఊరికి చెందిన రవీందర్‌రెడ్డి దారి లేదని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన కుటుంబీకులు, బంధువులు శవాన్ని ట్రాక్టర్‌లో వేసుకుని కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. స్థానిక ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అడ్డుకుని సముదాయించారు. సదరు పట్టదారు రవీందర్‌రెడ్డితో మాట్లాడటంతో ఒప్పుకొని దారి వదలడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

డీజే సౌండ్స్‌తో కోళ్లు చనిపోతున్నాయని ఫిర్యాదు

మొయినాబాద్‌: ఫాంహౌస్‌లలో రాత్రి వేళ డీజే సౌండ్స్‌ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సురంగల్‌కు చెందిన సురేందర్‌ రెడ్డి శనివారం మొయినాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సురంగల్‌ గ్రామ సమీపంలోని బ్రిడ్జ్‌ ఫాం వెంచర్‌లో ఉన్న ఫాంహౌస్‌లో రాత్రి సమయంలో డీజేలతో హోరెత్తిస్తున్నారని.. దీంతో పక్కనే ఉన్న తమ పౌల్ట్రీ ఫాంలోని కోళ్లు భయంతో మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు.

వైభవోపేతం.. గిరిప్రదక్షిణం



గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థాన క్షేత్రం చుట్టూ శనివారం గిరిప్రదక్షిణ వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తునవిచ్చేసి క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ కోట్ల మైపాల్‌ రెడ్డి, ఈఓ బాలనర్సయ్య, స్థానిక హిందూ ఉత్సవ కమిటీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తండాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఓంప్లనాయక్‌తండాలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు రూరల్‌: నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండాకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ కింద రూ.30 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రకటించారు. శనివారం పెద్దేముల్‌ మండలం తట్టేపల్లి, ఓంప్లానాయక్‌ తండాలో జై బాపు, జై భీం, జై సంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దళితులు, గిరిజనుల అభివృద్ధిని విస్మరించిందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని కాషాయపార్టీ కుట్ర పన్నుతుందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు గ్రామాలు, తండాల్లో జై బాపు, జైభీం, జై సంవిధాన్‌ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అంబేడ్కర్‌, గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

మౌలిక సదుపాయ కల్పనకు కృషి

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్న ఓంప్లానాయక్‌ తండాలో మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ గిరిజన మహిళా నేత సుమిత్ర రాథోడ్‌ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. తండాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్‌, ప్రోగాం ఇన్‌చార్జి షహీం ఖురేషి, కోట్‌పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ అంజయ్య, నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌, నాయకులు నారాయణరెడ్డి, రియాజ్‌, ఎల్లారెడ్డి, మల్లేశం, రవి, మహేష్‌, డీవై నర్సిములు, మధుసూదన్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్‌: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి సరైన మార్గమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తుర్కయాంజాల్‌ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌, బ్యూటీషియన్‌ శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 200 మంది మహిళలకు శనివారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అతివలు మరొకరికి మార్గదర్శకంగా నిలవాలని, ఒకరికొకరు చేయూతనందించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ యాదిరెడ్డి, నాయకులు బలవంతరెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్‌, రమేశ్‌గౌడ్‌, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్‌, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్‌, బాల్‌రాజ్‌గౌడ్‌, పాండు, మధుసూదన్‌రెడ్డి, పోచయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణాలు



ఏన్కతలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

- పరికరాలు లేక శిక్షణకు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

మోమిన్‌పేట: సరైన పరికరాలు లేక తెలంగాణ క్రీడా మైదానాలు వెలవెలబోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ప్రాంగణాలు ప్రస్తుతం సూచిక బోర్డులకు మాత్రమే పరిమితమవుతున్నాయి. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో యువతి, యువకులు క్రీడలకు దగ్గర చేసేందుకు వీటిని ఏర్పాటు చేశారు. అక్కడ కొన్ని పరికరాలను అమర్చి కొంతకాలం నడిపించారు. కానీ చాలాచోట్ల క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా ఉండడంతో కాలక్రమేణ అవి ఆదరణ కోల్పోయాయి. ప్రస్తుతం అందులో ఏలాంటి పరికరాలు లేకుండా పోయాయి.

ఊరికి దూరంగా ఏర్పాటు

మండల పరిధిలోని 28 గ్రామ పంచాయితీ పరిధిలో క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేశారు. చాలాచోట్ల గ్రామాలకు దూరంగా విసిరేసినట్లు ఉండటం, పరికరాలు లేకపోవడంతో కేవలం బోర్డులకే పరిమితమయ్యాయని యువకులు పేర్కొంటున్నారు. ఏ ఒక్క మైదానంలో ఆటలు ఆడటం లేదని చెబుతున్నారు. ఏన్కతలలో గ్రామానికి కిలోమీటరు దూరంలో బోర్డు పెట్టి వదిలేశారు. దీంతో యువకులు ప్రాంగణంలో క్రీడా పరికరాలు లేకుండా ఎలా వదిలేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి పరికరాలు అమర్చాలని కోరుతున్నారు. మరోవైపు క్రీడ ప్రాంగణాల బిల్లుల నగదు ఇప్పటికీ అందలేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూలే స్మారక భవనం నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

రాజేంద్రనగర్‌: మహాత్మ జ్యోతిరావు పూలే స్మారక భవనంతో పాటు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ వెల్లడించారు. రాజేంద్రనగర్‌ నియోజకవర్గ మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యోత్సవ కమిటీ అధ్యక్షుడు బండారి శంకర్‌ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పూలే కాంస్య విగ్రహంతో పాటు స్మారక భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కాంస్య విగ్రహం ఏర్పాటుతో పాటు స్మారక భవన ఏర్పాటు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ తలారి మల్లేష్‌, కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాచారి, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ ముదిరాజ్‌, అడిగే అర్జున్‌, బంగి శ్రీను, మల్లికార్జున్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చీరల చోరీ ముఠా అరెస్టు

ఏడుగురి రిమాండ్‌.రూ.2 లక్షల విలువైన చీరలు, కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాస్‌

మియాపూర్‌: చీరలు కొనేందుకు షాపింగ్‌ మాల్స్‌కు వెళ్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఏడుగురిని మియాపూర్‌ పోలీసులు అరెస్టు చేశారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోకుండా మళ్లీ చీరల చోరీలకు పాల్పడుతున్న ఈ ముఠా నుంచి రూ.2 లక్షల విలువ చేసే చీరలు, ఇక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాస్‌, ఇన్‌స్పెక్టర్‌ క్రాంతి కుమార్‌,డీఐ రమేష్‌ నాయుడు కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం తిరుపూర్‌ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు, చౌటూరు గ్రామానికి చెందిన కట్ట యశోద, సద్దుపాటి తిరుపతమ్మ, వెంకటేశ్వరమ్మ, చత్రాయిమండలం జనరాద్రవార గ్రామానికి చెందిన రమణ అలియాస్‌ రావణక్క, విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన దేరవకొండ సుభాషిణి, జగ్గయ్యపేట్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఓ ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాలలో చీరల దొంగతనాలకు పాల్పడుతుండేవారు. ఈ ముఠాలో సుమారు 50 నుంచి 100 మంది సభ్యులున్నట్లు తెలిపారు. వీరు గ్రూపులుగా ఏర్పడి 30 సంవత్సరాల నుంచి చీరల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇన్నోవా కారులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ తిరుగుతూ తక్కువ ఉద్యోగులు ఉన్న షాపింగ్‌ మాల్స్‌, ఇళ్లల్లో చీరల వ్యాపారం నిర్వహించే వారిని టార్గెట్‌ చేసుకుంటారు. నిర్వాహకులు దృష్టి మరల్చి చీరలు దొంగిలిస్తారు. ప్రతి నెలా 5 నుంచి 8 దొంగతనాలకు పాల్పడతారు.

దొంగతనం తర్వాత మొక్కులు చెల్లిస్తారు..

దొంగిలించిన చీరలను తీసుకుని వీరు కారులో యాదగిరిగుట్ట, ఇతర దేవాలయాలకు వెళ్తుంటారు. అక్కడ దేవుడికి మొక్కులు చెల్లించుకుని అనంతరం విజయవాడకు వెళ్లి కనకదుర్గమ్మ దేవాలయం ముందు, బస్టాప్‌, సంతల్లో, రద్దీ ప్రదేశాల్లో ఒక్కో చీరను రూ.2 వేల నుండి 10వేల వరకు అమ్ముతుంటారు. అమ్మగా వచ్చిన డబ్బులను ముఠా సభ్యులు పంచుకుంటారు. కాగా చీరల దొంగతనం చేసే ముఠా సభ్యులపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. అనేక సార్లు అరెస్ట్‌ అయి జైలుకు కూడా వెళ్లివచ్చారు. అయినా వీరు దొంగతనాలు మానలేదని చెప్పారు.

మియాపూర్‌ పోలీసులకు ఇలా పట్టుబడ్డారు...

గత 28వ తేదీన మియాపూర్‌లోని ఫ్రెండ్స్‌ కాలనీలో ఈ ముఠా సభ్యులు వెంకటేశ్వరరావుతో పాటు మహిళలు చీరల షాపుకు వెళ్లారు. షాపు నిర్వహించే మహిళ బయటకు వెళ్లడంతో ఆమె భర్త వచ్చిన వారికి చీరలు చూపించాడు. చీరలు చూస్తూ యజమాని దృష్టి మరల్చేందుకు నీళ్లు కావాలని అడిగారు. దీంతో యజమాని ఇంట్లోకి వెళ్లి వాటర్‌ తీసుకువచ్చేలోపు మరికొంత మంది మహిళలు చీరలు దొంగిలించారు. కొద్దిసేపు చీరలు చూసి మళ్లీ వస్తామని చెప్పి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి షాపు నిర్వాహకురాలు ఇంటికి వచ్చి పరిశీలించగా 14 చీరలు కనిపించలేదు. దీంతో మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఈ నెల 3వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు.